# అయ్యవారంటే ఆయినే !

ఊళ్ళో పెద్దోళ్ళ లెక్కంబడి నర్సరామయ్య బాగా 'సెర్దగా పిల్లోళ్ళకు సదువు జెప్పినాడు'. అయ్యవారంటే ఆయినే! పొద్దున్నే బల్లోకి వచ్చేతప్పుడు సందెడు సింతబర్రలు మోసుకోని తెస్తే, మాపిటేలై బడి యిడ్సేతలికి అయన్నీ వూసిపోయిండేవి. ఎంత సెర్ద ల్యాకపోతే అన్ని సింతబర్రలిరిగేంత సదువు జెప్తాడు మల్ల! ఊళ్ళో నాలుగచ్చరం ముక్కలు రావడానికి ఆయన గట్టి పునాది యేసినోడు, ఎప్పుటికీ దండం బెట్టుకొంటా వుండాల.

మొట్టమొదుట ఆయన సదువుజెప్పడానికి వొచ్చేతలికి మూతి మీన ముశాలు గూడా సరిగా మొల్చలా. ముశాలు రాని ఆయన సదువు జెప్తాంటే, మూరెడు ముశాలు తీర్న మొగోళ్ళు ఓనమాలు నేర్సుకొన్నారు. అప్పుటికింగా ఆడోళ్ళు బల్లో కొచ్చేది తెల్దు. అంతంతోళ్ళకు సదువు జెప్పాలన్నా, వాళ్ళనేమన్నా అనాలన్నా అయ్యవారికే బయమై, గుండె లొటలొటమని కొట్టుకొనేదంట. వాళ్ళ ముశాల్దిక్కూ, మొగాల్దిక్కూ సూస్తానే సదువు జెప్పడమట్టబోనిచ్చి ఆయినకొచ్చిన సదువే మర్సిపోయేవాడంట. అయితే, వాళ్ళు మాత్రం పసిపిల్లోల్లాల, సరకసోని కొరడా సూసి బయిపడే ఏనిగలమాద్రి అయ్యవారి సింతబర్ర సూసి బయపడేవాళ్ళు. అలవాటు కొద్దీ ఒక సేత ముశాల్దువ్వుకొంటానే వున్నా యింగో సేత యినయంగా యిసికలో అచ్చరాలు దిద్దుకొన్నారు. వాళ్ళంత బయపడ్తా వున్నా, వాళ్ళ పెద్దోళ్ళు సేలకాడికో, కల్లం కాడికో బోతా తొంగిసూసి, "అయ్యా, మావాన్ని బాగా తన్నయ్యా, ఎప్పుటికప్పుడు వొప్పజెప్పేట్టు తన్ను" అనేవాళ్ళు. ఒక్కొక్కసారయితే వాళ్ళకు రోంత వుసి దొరికినప్పుడు, బల్లోకొచ్చి కూచ్చోని "అయ్యా, మావానికి తొందరగా సదువొచ్చేట్టు తన్నయ్యా, నేనుండాలే నీకేం బయం లేదు" అంటా అన్నే నిలబడుకోని, అయ్యవార్చేత వాళ్ళ పిల్లోళ్ళను బలంతంగా తన్నిచ్చుకోని, అప్పుడు పోయేవాళ్ళు.

మొట్టమొదుట, పాపం కొట్టడానికి అయ్యవారి సేతిలో యేమీ లేదే అని సింతబర్ర తెచ్చిచ్చింది పెద్దోళ్ళే. అవతల అయ్యవారే సొంతంగా సింతబర్రలు తయారుసేసి తెచ్చుకోబట్నాడు. ఒక్క సింతబర్రసిచ్చేగాక, కోదండం, కోలుకొంకర్రాయీ, తొడపాశం యిట్టా యెన్నో సిచ్చలు యేస్తా సదువుజెప్పడం మొదులుపెట్నాడు. పనుల మీద పోతాండే పెద్దోళ్ళు కోదండంలో వుండే వాన్ని సూసి, 'సదువంటే యిట్టా సెప్పాల' అనుకుంటాపోయేవాళ్ళంట. పెద్దోళ్ళు మెచ్చుకొనే కొద్దీ అయ్యవారు 'యింగా సెర్దగా సదువుజెప్పడం' మొదులుపెట్నాడు. దయ్యం పట్టిందని సెప్పి మంత్రగాడు యెట్ట కొట్తాడో, అట్ట అయ్యవారు వాళ్ళను కొట్టేవాడంట. ఎక్కాల్జెప్తా వుండేది ఏటవుతలికి యినిపిచ్చేదంటగానీ, అట్టగొట్నా యేడ్సేది యెవురికీ యినపడేది గాదంట ! రాన్రానూ కొట్నెందుకంటే, కొట్తే ఏడ్సకుండా వుండడం పెద్ద బాదయిందంట.

అదో... అప్పుడు జరిగిందే నారాయిన కత. ఒకనాడు పొద్దన్నే అయ్యవారు మాంచి సింతబర్ర సేతబట్టుకోని నారాయిన్ను తనకాడికి పిల్సినాడు. ఆయనట్టా పిలిస్తే పోయి సేయిబట్టాల. తొడపాశం పెడ్తే, యింగ ఆ కాలు అయ్యవారికే యిచ్చేసి, మిగిల్న ఒక్కాలు మీందనే నిలబడుకోనుండాల. నారాయిన

అసలే బెదురోడు, సిన్న దెబ్బకే బేరుమనేవాడు. ఏడ్సునిస్తే బాగా ఏడ్సి, ఎట్టనో కట్ట దెబ్బల్తినేవాడు గానీ ఏడ్సుగూడ్దుగదా ! అందుకని, అయ్యావార్దగ్గిరికి పోకుండా బైటికి పరిగెత్తినాడు. అయ్యవారికింగా ఆగ్గరమొచ్చి, సింతబర్ర పట్టుకోని ఎంటపన్నాడు ! నారాయిన ముందు వాళ్ళింటి కాడికి పరిగెత్తి, వాళ్ళవాళ్ళింగా తన్నమంటారు గదాని గ్యాపకమొచ్చి, దిక్కు తెలక అన్నుంచీ సేలల్లోకి పరిగెత్తినాడు. ఎనకంబడే అయ్యావారూ !

ఇట్ట ముందు నారాయినా, ఎనకాల అయ్యావారూ పరిగెత్తా పొలిమేర దాట్నారు. ఇంగ దొరుకుతాడు లెమ్మని యీయనా, ఎనక్కిపోతాడు గదా అని నారాయినా! సేలల్లో వుండేవాళ్ళంతా సూస్తానే వుండారంట. పొలిమేర దాట్నాక ఎంకన్నపల్లె, కోగటం యిట్టా ఊళ్ళు గూడా దాటిపోతా వుండారంట. "యాడికబ్బీ ఇట్ట పరిగెత్తావుండారు?" అని ఆ ఊళ్ళోళ్ళు యెవురన్నా అడిగితే, "యాడికో నాకేం తెల్సు? అయ్యావారు తరుముతాండారు, నేను పోతావుండా" అని నారాయిన సెప్పేవాడంట.

ఎండపొద్దు అయిన్దాన ఇద్దరికీ గొంతులెండిపోతావున్నా యెవురూ వోడిపోలేదంట. "ఇంగ సిక్కనుగానీ ఎనక్కిపోయ్యా" అని నారాయిన అయ్యావార్ని బంగపట్టాడంట. "రేయ్, యింగనన్నా సిక్కరా" అని అయ్యావారూ, "నే సిక్కను" అని నారాయినా. "సిక్కినావంటే ఎంకలిరగ్గొడ్తా" అని అయ్యావారూ, "అందుకే సిక్కను" అని నారాయినా. ఇంతదూరం పరిగెత్తి యిప్పుడెనక్కు పోయేదెట్టా అని అయ్యావారూ, యింత పరిగెత్తినాక అయ్యావారెంతగా కొట్తాడో అని నారాయినా.

"యీడ బుడ్డ వుంది దిగబడ్తాది బద్రం" అని, "అడ ముల్లులుండాయి సూసుకో" మనీ అయ్యావారికి పాపం జాగర్తలు సెప్తానే నారాయిన ముందు పరిగెత్తా వుండాడంట. సేలల్లో పన్జేసే వాళ్లెవురన్నా "బీడీ వుంటే యిచ్చి పరిగెత్తు" అని అయ్యావార్ని అడిగితే "మా అయ్యావారు బీడీల్తాగరు, పక్కకు తీబ్బా" అని నారాయినే సెప్పినాడంట. "నా మాటిని పోయ్యా, ఎందుకు సెమ?" అని నారాయిన సెప్పినప్పుడల్లా, అయ్యావార్ని నా మాట వాడినాల్నా, వాని మాట నేనినాల్నా, అని ఆయినకింగా కోపం. ఇట్ట ఇద్దరూ తిండీతిప్పలూ, నీళ్ళూ నిప్పుల్ల్యాకుండా పరిగెత్తా, గసొచ్చినప్పుడు[1] రోంత సేపు నిలబడ్తా ... కోగటం, సంబటూరు, కల్లూరు దాటేతప్పటికి పొద్దుగూడా వాటారింది.

అప్పటికి వాళ్ళు పెన్న ఇవతలి పక్క వూళ్ళ మీదుగా పరిగెత్తి, పెన్నలో దిగి అవతలి పక్కకు పోయి సుట్టు తిరిగినారన్న మాట! అప్పుడు "రేయ్! పొద్దుగూకుతాంది. మనూరికి మళ్ళు" అని అయ్యావారర్సి సెప్తే, సరేనని నారాయిన వూరికెదురుగా పెన్నలో దిగినాడు. పొద్దన అయ్యావారు నారాయిన్ను తరుముతా పాయె, యిద్దరూ యింగా రాలేదని వూరోళ్ళు సూస్తా వుంటే, ఒకరెనక ఒకరు సోలాడ్తా వొచ్చి వాళ్ళ కెదురుగ్గా దెబ్బల్తిన్న కోళ్ళ మాదిరి కూలిపోయిరంట.

వాళ్ళు ఆ ఇద్దర్నీ సేతుల మీన యిండ్లకు మోసకపోతే, అప్పుడు మంచంలో పన్న ఆ ఇద్దరూ మూడ్రోజులు లెయ్యల్యాక పోయిరంట.

❁

---

1) ఆయాసమొచ్చినప్పుడు